AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
3-12-2025 (Wednesday)
MAIN EDITION

## గుండెపోటుతో ఎస్సై మృతి



**అక్షరటుడే, హైదరాబాద్** : హైదరాబాద్‌లో విషాదకర ఘటన చోటు చేసుకుంది. గుండెపోటుతో ఓ ఎస్సై మృతి చెందాడు. పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఉదయం ఆయన కుప్పకూలాడు. నాచారంలో నివాసం ఉండే సంజయ్ సావంత్ (58) ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పని చేస్తున్నారు. బుధవారం ఉదయం పంచాయతీ ఎన్నికల విధులకు వెళ్లాల్సి ఉండడంతో మంగళవారం రాత్రి ఆయన పోలీస్ స్టేషన్‌లోనే నిద్రించారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఒక్కసారిగా కుప్పకూలారు. కానిస్టేబుల్స్ వెంటనే ఎస్సైని సమీపంలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

## మోదీపై కాంగ్రెస్ ఏఐ వీడియో.. దుమారం



**అక్షరటుడే, ఢిల్లీ:** పార్లమెంట్ శీతాకాల సమావేశాల వేళ కాంగ్రెస్ నాయకురాలు పోస్ట్ చేసిన ఓ వీడియో తీవ్ర దుమారం రేపింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీని కించపరిచేలా ఆ వీడియో ఉండడంపై బీజేపీ నేతలు భగ్గుమన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రాగిణి నాయక్ తన సోషల్‌మీడియా ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. ప్రధాని చాయ్ అమ్ముతున్నట్లుగా ఉన్న ఏఐ జనరేటెడ్ వీడియో అది. దీంతో ఇది వివాదాస్పదమైంది. ఈ వీడియోపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రధాని మూలాలను వారు అవమానిస్తున్నారంటూ బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా దుయ్యబట్టారు.

## విద్యుత్ ఛార్జీలు పెంచబోం



**అక్షరటుడే, ఏపీ:** తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలో సీఎం చంద్రబాబు పర్యటించారు. 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో భాగంగా రైతులు, రైతు కుటుంబాలతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. విద్యుత్ ఛార్జీలను పెంచేది లేదని మరోసారి స్పష్టం చేస్తున్నానని తెలిపారు. ఛార్జీలను పెంచకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

## 26 వేల దిగువకు నిఫ్టీ



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి ఫ్లాట్‌గా ముగిశాయి. ఆర్‌బీఐ ఎంపీసీ వేళ మదుపర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ నెల 5న ఆర్‌బీఐ వడ్డీ రేట్లపై ప్రకటన చేయనుంది. దీంతో వరుసగా నాలుగోరోజూ సూచీలకు నష్టాలు తప్పలేదు. చివరలో కాస్త కొనుగోళ్ల మద్దతు కనిపించినా ప్రయోజనం లేకపోయింది.

## రూపాయి ఢమాల్..



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి విలువ దారుణంగా పతనమైంది. బుధవారం నాటి ట్రేడింగ్‌లో డాలర్‌తో పోలిస్తే ఏకంగా 90 మార్క్‌ను దాటి సరికొత్త జీవనకాల కనిష్ఠానికి పడిపోయింది. క్రితం సెషన్‌లో 89.96 వద్ద ముగిసిన రూపాయి విలువ.. బుధవారం ఏకంగా 90.14 వద్ద ఆల్‌టైం కనిష్ఠాన్ని తాకింది.

## పల్లెల్లో ప్రచార హోరు

**పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పల్లెల్లో రాజకీయం వేడెక్కింది. మొదటి విడత ఉపసంహరణ గడువు ముగియడంతో అధికారులు బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితా విడుదల చేశారు. దీంతో గురువారం నుంచి గ్రామాల్లో ప్రచారం జోరందుకోనుంది. ఇప్పటికే అభ్యర్థులు ఇంటింటికి తిరిగి మద్దతు కోరుతున్నారు. గుర్తులు కేటాయింపు తర్వాత ప్రచార జోరు పెంచనున్నారు.**

-అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



■ ముగిసిన ఉపసంహరణ గడువు ■ గుర్తులు కేటాయించనున్న అధికారులు ■ రేపటి నుంచి వేడెక్కనున్న రాజకీయాలు

తొలిదశలో రాష్ట్రంలోని 4,236 పంచాయతీలు, 37,440 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. నవంబర్ 27 నుంచి 29 వరకు నామినేషన్లు స్వీకరించారు. 4,236 సర్పంచ్ స్థానాలకు 25,654 నామినేషన్లు వేశారు. 37,440 వార్డు సభ్యుల పదవులకు 82,276 మంది నామినేషన్లు వేశారు. డిసెంబర్ 3న మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణకు అవకాశం ఇచ్చారు. పలువురు అభ్యర్థులు తమ నామినేషన్లను వెనక్కి తీసుకున్నారు. దీంతో అధికారులు తుది జాబితా సిద్ధం చేస్తున్నారు.

### గుర్తుల కేటాయింపు

అభ్యర్థుల తుది జాబితా ఖరారు అయిన తర్వాత అధికారులు గుర్తులు కేటాయించనున్నారు. సర్పంచ్ పదవి కోసం ఎన్నికల సంఘం 30 ప్రత్యేక గుర్తులను కేటాయించింది. వార్డు సభ్యుల కోసం 20 గుర్తులను కేటాయించింది. రేపటిలోగా గుర్తులు ఖరారు కానున్నాయి. అనంతరం అభ్యర్థులు ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లు ముద్రించి జోరుగా ప్రచారం చేయనున్నారు. దీంతో పల్లెల్లో రాజకీయం రసవత్తరంగా మారనుంది.

### రోజు మంతనాలు..

సర్పంచ్ పదవికి పోటీ చేసిన అభ్యర్థులు నిత్యం అనుచరులతో మంతనాలు సాగిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి తమకు ఓటు వేయాలని ఇప్పటికే కోరారు. కుల సంఘాలను కలిసి మచ్చిక చేసుకుంటున్నారు. గ్రామంలో పరిస్థితులపై నిత్యం సాయంత్రం కాగానే.. అనుచరులతో మంతనాలు సాగిస్తున్నారు. ఎవరి ఓట్లు ఎటు పడతాయి.. గెలవాలంటే ఏం చేయాలని ప్రణాళికలు రచిస్తున్నారు. గుర్తులు కేటాయించిన తర్వాత అనుచరులతో నిత్యం పల్లెల్లో ప్రచారం చేసేలా ప్లాన్ చేస్తున్నారు.

## మూడో విడత నామినేషన్ల స్వీకరణ ప్రారంభం



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. రెండు దశల నామినేషన్ల స్వీకరణ ముగిసింది. బుధవారం ఉదయం 10 గంటలకు మూడో దశ నామినేషన్లు ప్రారంభం అయ్యాయి. రాష్ట్రంలో మూడో విడతలో 182 మండలాల్లో 4,159 సర్పంచ్, 36,452 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. శుక్రవారం వరకు నామినేషన్లు వేయడానికి అవకాశం ఉంది. డిసెంబర్ 6న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. డిసెంబర్ 9 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. 17న పోలింగ్ నిర్వహించనున్నారు.

## విమానాన్ని వేలం వేయనున్న ఈడీ..

**అక్షరటుడే, హైదరాబాద్:** ఫాల్కన్ కేసులో ఈడీ కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో స్వాధీనం చేసుకున్న విమానాన్ని వేలం వేయనున్నట్లు ప్రకటించింది. బేగంపేట ఎయిర్‌పోర్టులో విమానానికి డిసెంబర్ 9న అధికారులు ఆన్‌లైన్‌లో వేలం నిర్వహించనున్నారు. బేగంపేట విమానాశ్రయంలో నిలిపి ఉంచిన హాకర్ 800ఏ విమానాన్ని వేలం వేస్తున్నట్లు ఈడీ ప్రకటించింది. రిజిస్ట్రేషన్ నంబర్ ఎన్935హెచ్ కలిగిన ఈ విమానం డిసెంబర్ 7 వరకు తనిఖీ కోసం అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. 9న ఎంఎస్‌టీసీ లిమిటెడ్ ద్వారా వే లం చేపట్టనున్నట్లు పేర్కొంది. ఈ డబ్బును మోసానికి గురైన బాధితులకు పరిహారం చెల్లించడానికి ఉపయోగించనున్నారు.

## ఆటోలో ఇద్దరి మృతదేహాలు..

**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో డ్రగ్స్, గంజాయి వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. ఎంతో మంది వీటికి బానిసలుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారు. నగరంలోని చంద్రాయణగుట్టలో ఓ ఆటోలో ఇద్దరు యువకుల మృతదేహాలు కలకలం రేపాయి. ఫ్లైఓవర్ కింద నిలిపి ఉన్న ఆటోలో మృతదేహాలు కనిపించాయి. మృతులు జహంగీర్, ఇర్ఫాన్‌గా గుర్తించారు. ఆటోలో మూడు ఇంజెక్షన్లను పోలీసులు గుర్తించారు. వారు డ్రగ్స్ తీసుకున్నట్లు అనుమానం. డ్రగ్స్ ఓవర్ డోస్ కావడంతోనే మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. ముగ్గురు వ్యక్తులు డ్రగ్స్ తీసుకున్నట్లు అనుమానిస్తున్నారు. మృతదేహాలను ఉస్మానియాకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రధానికి ఆహ్వానం



**అక్షరటుడే, హైదరాబాద్** : తెలంగాణ ప్రభుత్వం డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ప్రధాని మోదీని సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ప్రధానిని కలిశారు. భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించి ఆహ్వాన పత్రికను ప్రధానికి అందజేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్దేశిత వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా.. తెలంగాణ రైజింగ్ 2047 దార్శనిక పత్రం రూపొందించినట్టు సీఎం వివరించారు. 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థ 3 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించామన్నారు. పలు రంగాల నిపుణులు, నీతి ఆయోగ్ సూచనల మేరకు విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినట్టు వివరించారు.

### అభివృద్ధికి సహకరించాలి

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలని సీఎం కోరారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలన్నారు. మొత్తం 162.5 కిలోమీటర్ల పొడవునా విస్తరించే ప్రతిపాదనలను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సమర్పించిందని, రూ.43,848 వేల కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా చేపట్టేందుకు ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి కేబినెట్ ఆమోదంతో పాటు ఆర్థిక పరమైన అనుమతులు, దక్షిణ భాగం నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు.

## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. దంతేవాడ-బీజాపూర్ మధ్య అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, బలగాలకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. బీజాపూర్ జిల్లాలో బుధవారం భద్రతా సిబ్బందికి, నక్సలైట్లకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగిందని పోలీసు అధికారి తెలిపారు. పశ్చిమ బస్తర్ డివిజన్‌లోని అడవిలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారం మేరకు బలగాలు కూంబింగ్ చేపట్టాయి. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, కోబ్రాకు చెందిన సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఈ క్రమంలో దంతేవాడ, బీజాపూర్ సరిహద్దుల్లోని భైరామ్‌గఢ్ ప్రాంతంలోని కేశ్‌కుతుల్ అడవుల్లో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది.

## చైనాలో కండోమ్స్‌పై ట్యాక్స్..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** చైనాలో కొంతకాలంగా జననాల రేటు భారీగా తగ్గింది. ఫలితంగా అక్కడ యువతరం తగ్గి పోయి వృద్ధుల జనాభా పెరుగుతోంది. ఇటీవల ప్రజలు పిల్లలను కనడానికి ఆసక్తి చూపడం లేదు. ఈ క్రమంలో చైనా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో తగ్గుతున్న జనన రేటును నియంత్రించడానికి చైనా ప్రభుత్వం గర్భనిరోధకాలపై విలువ ఆధారిత పన్ను విధించాలని నిర్ణయించింది. గత మూడేళ్ల నుంచి దేశంలో జననాల రేటు పడిపో. ఈ క్రమంలో ప్రభుత్వం కండోమ్స్, ఇతర గర్భ నిరోధకాలపై వ్యాట్ విధించడానికి సిద్ధమైంది. చైనా గతంలో కుటుంబ నియంత్రణ కోసం కఠిన నిబంధనలు అమలు చేసింది. ఒకరే బిడ్డను కనాలనే నిబంధన పెట్టింది. 1993 నుంచి అక్కడ కండోమ్స్‌పై ఎలాంటి వ్యాట్ లేదు. తాజాగా 13శాతం వ్యాట్ విధిస్తూ నిర్ణయం చైనా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై స్పందించిన సోదరి ఉజ్మా..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్థాన్ మాజీ ప్రధాన మంత్రి, పీటీఐ చీఫ్ ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం గురించి ఆయన సోదరి డాక్టర్ ఉజ్మా కీలక వ్యాఖ్యలు చేశారు. రావల్పిండిలోని అడియాలా జైలులో ఇమ్రాన్ ఖాన్‌ను కలిసిన తర్వాత ఆమె మీడియాతో మాట్లాడారు. కొన్ని వారాలుగా ఆయనను ఎవరికీ కలిసేందుకు అధికారులు అనుమతించకపోవడంతో ఆందోళనలు పెరిగిన విషయం తెలిసిందే. చివరకు అనుమతి లభించడంతో మంగళవారం సాయంత్రం 20 నిమిషాలపాటు ఆమె ఆయనతో మాట్లాడారు. ఉజ్మా వెల్లడించిన వివరాల ప్రకారం... 'ఇమ్రాన్ బతికే ఉన్నారు, ఆరోగ్యంగా ఉన్నారు.. కానీ మానసికపరంగా తీవ్ర వేధింపులు ఎదుర్కొంటున్నారు' అని స్పష్టంచేశారు.

## సంచార్ సాథీతో స్నూపింగ్ సాధ్యం కాదు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** సంచార్ సాథీ పదం రెండు రోజులుగా తెగ వినిపిస్తోంది. భారత్‌లో విక్రయించే ఫోన్లలో ఈ యాప్‌ను ముందుగానే ఇన్‌స్టాల్ చేసి ఇవ్వాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశం దుమారం రేపుతోంది. ఇది ప్రజల వ్యక్తిగత జీవితాలపై నిఘా పెట్టడమే అవుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మరోసారి స్పష్టత ఇచ్చారు. అసలు స్నూపింగ్‌కు తావే లేదని, అది సాధ్యం కాదని బుధవారం లోక్‌సభలో వెల్లడించారు. ఇది ప్రజల రక్షణ కోసమేనన్నారు. యాప్‌లో రిజిస్టర్ అవకుండా అది పనిచేయదని వివరించారు.

## డివైడర్‌ను ఢీకొన్న కారు.. ముగ్గురి మృతి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్** : అతివేగంగా వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. ఐదుగురు యువకులు కారులో వియం బంజర్ వైపు నుంచి సత్తుపల్లి వెళ్తున్నారు. కిష్టారం, అంబేద్కర్ కాలనీ వద్ద డివైడర్‌ను కారు ఢీకొంది. ప్రమాదంలో సత్తుపల్లిలోని కొంపల్లి కాలనీ చెందిన జయ్, శశి, మహబూబ్ నగర్ చెందిన సాజిద్ మృతి చెందారు. మరో ఇద్దరు తలారి అజయ్, ఇమ్రాన్ తీవ్రంగా గాయపడ్డారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రైల్వే స్టేషన్‌లో పేలిన నాటుబాంబు




**అక్షరటుడే, భద్రాద్రి కొత్తగూడెం:** రైల్వే స్టేషన్‌లో నాటుబాంబు పేలడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో బుధవారం చోటు చేసుకుంది. రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై గుర్తు తెలియని వ్యక్తులు నల్లని సంచులు వదిలి వెళ్లారు. అందులో ఉల్లిగడ్డ పరిమాణంలో ఏడు నాటు బాంబులు ఉన్నాయి. తినే పదార్థం అనుకొని ఓ కుక్క బాంబును కొరికింది. దీంతో అది పేలి కుక్క అక్కడిక్కడే చనిపోయింది. ఈ ఘటనతో స్టేషన్‌లో ఉన్న వారు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రయాణికులు బయటకు పరుగులు తీశారు.

### పోలీసుల తనిఖీ

సమాచారం అందుకున్న కొత్తగూడెం మూడో టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మిగతా సంచులను పరిశీలించారు. ఆరు నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నారు. ఉదయం వెళ్లే రైలులో నాటు బాంబులను తరలించేందుకు ఎవరో ప్రయత్నించి ఉంటారని పోలీసుల అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు.